# మనసున్న బొమ్మ



పిల్లలంతా చేరి బొమ్మల పెళ్లి చేస్తున్నారు. అందులో ప్రెసిడెంటుగా రమ్మాయి రమ పెళ్లికూతురి తల్లి, మునసబుగా రమ్మాయి రాధ పెళ్లి కొడుకు తల్లి. ఇద్దరూ దొరికిన తువ్వాళ్లు చీరలుగా చుట్టేసుకున్నారు. పెద్ద ఆరిందాల్లా పనులు పురమాయిస్తూ హడావిడి పడిపోతున్నారు. పెళ్లి అయిపోయింది. బొమ్మను రాధ చేతిలో పెడుతూ, "వదినా! మా పిల్ల ఇకనుండి మీ పిల్లే!" అంటూ కళ్లు తుడుచుకుంది రమ, ఒక పక్క నవ్వుతూ! రాత్రి అయిపోయింది. అన్నీ సర్దేసుకుని ఇంటిముఖం పట్టారు పిల్లలందరూ!

"రమా! ఇదిగో, నీ బొమ్మ! నా దగ్గరే వదిలేసి వెళ్లిపోతావేం! మళ్లీ మనం ఆడుకోవద్దూ?" అంటూ పెళ్లి కూతురి బొమ్మను తిరిగి ఇచ్చేసింది రాధ.

బొమ్మ నెత్తుకుని పరుగెత్తుకుంటూ వచ్చిన కూతురికి నీళ్లు పోసి, వేడివేడి భోజనం పెట్టింది గౌరి.

"అస్తమానం బొమ్మలపెళ్లేనేమిటే, ఇంకేం ఆటల్లేనట్టు! ఆ బొమ్మకే ఎన్నిసార్లు చేస్తావు!" నవ్వుతూ అంది గౌరి పడుకోబోతూ.

"నా దగ్గర అదే కదా ఉంది! ఎన్ని సార్లు చేసినా నా దగ్గరే కదే ఉంది. అందుకు దానికే చేస్తాను. మరి కొత్త బొమ్మ కొంటావా? దానిక్కూడా చేస్తాను!"

"ఓ! ఈసారి నాన్నగారు పట్నం వెళ్లినప్పుడు తెమ్మంటాలే!"

* * *

గది అందంగా అలంకరించి ఉంది. గదిలో మంచంమీద రాజు సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు. తడబడే అడుగులతో అడుగుపెట్టింది రమ. ఎంతసేపు నిలబడినా ఏమీ జవాబు లేకపోయేసరికి నెమ్మదిగా వెళ్లి మంచంమీద చివరగా ఒదిగి కూర్చుంది. ఆమెను చూసి రాజు సిగరెట్టు విసిరేసి లేచి కూర్చున్నాడు సరిగా. ఏవో ఊహలతో మనసంతా గజిబిజిగా, ఏదోగా ఉంది రమకు. ఏం మాట్లాడుతాడో అని ఉద్వేగంగా ఎదురు చూస్తోంది.

"చూడూ! 'రమ' అనుకుంటాను నీ పేరు!"

'అనుకోవడమేమిటా' అని ఆశ్చర్య పోయింది.

"నన్ను క్షమించు! నష్టమయినా అనుకో. మూర్ఖుడనుకో, మోసగాడనుకో, చవట అనుకో! ఏమనుకున్నా నాకేం ఫరవాలేదు! కాని, నేను మాత్రం నీ భర్తను కాను. నీతో నా కేవిధమైన సంబంధం ఉండదు. నీకేమయినా కావలిస్తే చూడ్డానికి మా అత్తగారు, మామగారు ఉన్నారు. నీకు, నాకు ఏ

రంగనాథంగారిమీద 'ఇది' ఆయనకు తెలియకుండానే ఒంటబట్టేసి ఆయన దిగజారిపోసాగారు. ఎటు వెళ్లినా కూతురి దీనమైన మొహం ఆయన కళ్లముందు కదలాడుతూనే ఉంది. ఎన్నాళ్ళనుండో బండబారిన గుండె కరగడం ప్రారంభించింది. అదెంతో కాలం పని చేయలేకపోయింది. కొడుకుల దగ్గర రమకు మళ్లీ పెళ్లి చేసేటట్లు మాట తీసుకుని కన్ను మూశారు రంగనాథంగారు. తల్లి మీద ద్వేషం చెల్లి మీద కాదని మళ్లీ పెళ్లి చేద్దామని నిర్ణయించుకున్నారా అన్నదమ్ములు.

• • •

ఇప్పుడిప్పుడే కోలుకుని తిరుగుతున్న రమ ఆలోచనలు భవిష్యత్తు వైపు పురోగమిస్తున్నాయి.

'నే నేం తప్పు చేశానని నా బ్రతుకిలా అడవి కాచిన వెన్నెల కావాలి?' అన్న ప్రశ్న తల ఎత్తడంతో మిగతావి ఒకటి తరవాత ఒకటి చోటు చేసుకున్నాయి.

"అమ్మా! నేను చదువుకుంటానే! ఇలా ఇంట్లో కూర్చుని ఏం చేయాలి?"

"అవ్వ! ఎవరైనా వింటే నవ్వుతారు. ఎంత చదువు చదివినా మళ్లీ పెళ్లి చేయాలి కదా? అయినా ఈ ఊళ్లో ఏం ఉందని చదువుకుంటావు? అన్నయ్యకి చెప్పాను! ఏదో సంబంధం చూస్తాడు. అలాంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు." సన్నగా మందలించి పనిమీద వెళ్లిపోయింది.

అలా వరండాలో కూర్చుని చూస్తున్న రమ ఆ వీధిలోనుండి వెళుతూన్న అబ్బాయిని చూసి ఆశ్చర్యపోయింది.

'ఎవరబ్బా! ఉద్యోగస్థుడిలా కనపడుతున్నాడు!' అనుకుంది. అంతలో గుర్తు వచ్చింది. 'చిన్నప్పుడు తనతో ఆడుకొన్న కరణంగారబ్బాయి గోవిందరావు. ఎక్కడో ఉద్యోగం వచ్చిందన్నారు. వచ్చాడుకాబోలు!' ఎందుకనో ఆ అబ్బాయి గురించి ఆలోచనలు వచ్చేసరికి చిన్నప్పటి సంఘటనలు, బొమ్మల పెళ్లిళ్లు గుర్తు వచ్చి మనసంతా కల్లోలంగా అయిపోయింది. మనిషి లేచి ఇంట్లోకివెళ్లినా, మనసులోనుండి గోవింద వెళ్లలేదు. ఇన్నాళ్లకి ఎండిపోయిన మెదడుకి మేత దొరికింది. వెన్నెల అడవిలో కాసినా, ఎక్కడ కాసినా దానికుండే చల్లదనం, కాంతి, కొంటెదనం ఎక్కడికి పోతాయి? పెళ్లయినా కన్యగా మిగిలిపోయిన 'రమ' అంటే లోకానికి, ఇరుగు పొరుగులకి జాలి ఉండవచ్చుగాని, ప్రకృతి కెందు కుంటుంది? వసంతంలో పూలు పూయడం మానేస్తాయా? ఏవేవో ఊహలతో అలా మంచంమీద వాలిపోయింది. అవన్నీ వట్టి ఊహలు, కలలు మాత్రమే అన్న వాస్తవానికి వచ్చినప్పుడు అవి కన్నీటి రూపంలో తలగడను తడిపివేశాయి.

'భగవంతుడా! నా కెందుకిలా చేశావ్?' పదేపదే గొణుక్కుంది కన్నీళ్ల మధ్య.

'వేగం పెళ్లి కుదిరితే?' అన్న ఆశ మొలకెత్తి వెంటనే— 'ఎవరు చేసుకుంటారు?' అన్న నిరాశగా మారిపోయేది.

ఒక్కొక్క క్షణంలో లోకంమీద, తల్లిమీద, రాజుమీద— అందరి మీద చెప్పలేనంత ద్వేషంతో, కసితో ఊగిపోయేది.

'నా జీవితం నాశనం చేయడానికి అతని కేం హక్కు ఉంది?' అన్న ప్రశ్న తలఎత్తి రాజు కనపడితే చంపేద్దామన్నంత


ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే

టూత్ పేస్ట్ —నీమ్

నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమేగాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్యప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణచేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్ వారి ఉత్పత్తి

కోపం వచ్చేది. కాని, వాటన్నింటికి ఆఖరుకి మిగిలేది కన్నీరే!

• • •

జరిగిన సంగతి విని పరామర్శకు వచ్చిన గోవిందుని చూసి పరవశించి పోయింది రమ. 'అప్పుడప్పుడు రమ్మని మరీ, మరీ చెప్పి పంపించింది. కాని, ఎందుకనో గోవిందు మళ్లీ వెళ్లిపోయి నప్పుడు చెప్పడానికి వచ్చాడు. అతను రానందుకు నిరాశ పడినా, అలా ఎప్పుడైనా వీథిలో వెళ్లిపోతుంటే పలకరించేది. దాని కేదో సమాధానం చెప్పేసి అలాగే వెళ్లిపోయేవాడు. గోవిందు వెళ్లిపోయాక ఆలోచించుకుంటే అతని మీద అలాంటి ఊహ లెందుకు వచ్చాయో అర్థం కాలేదు. తనను చూసి, తనకే అసహ్యం వేసింది.

* * *

కాలం అలా జరిగిపోతూనే ఉంది. ఎట్లాగో రోజులు గడిపేస్తూంది రమ. ఆలోచనలకు అంతు ఉండడం లేదు. ఎంత వైరాశ్యంలో మునిగిపోయినా, ఏదో ఆశ జీవించేటట్లు చేస్తూంది. ఆ శుభ ముహూర్తం రానే వచ్చింది. చిన్నన్నయ్య శంకరం స్నేహితుడిని తీసుకుని వస్తున్నా నన్న ఉత్తరం చూసి మురిసిపోయా రా తల్లీ కూతుళ్లు. జరిగిన సంగతంతా విడమరిచి చెప్పి తీసుకొచ్చాడు సుందరాన్ని శంకరం. సుందరానికి ఒక్క మేనత్త తప్పించి ఎవరూ లేకపోవడం మూలాన అంతా అతని ఇష్టమే కనక ఇష్టపడే చూడ్డాని కొచ్చాడు. రమను చూశాక వద్దనడానికేం కారణం కనపడలేదు.

• • •

"అతనికి మువ్వక్కర లేకపోయినా, నీ మనసులో అతను తిష్ఠ వేశాడు కాబోలు! మీ ఆడవాళ్లకి ఒకడే ప్రియుడు కదా! అందులో భర్తగా నీ జీవితంలో అడుగు పెట్టిన మొదటి వ్యక్తిని మరిచిపోవడం అంత సులభం కాదనుకొంటాను!"

వెనగ్గా వచ్చిన మాటలకి తుళ్లిపడి ఆలోచనలోనుండి తేరుకుని అయో మయంగా వంటింట్లోకి నడిచింది. ఏదో ఒకటి అలా అంటూ ఉండడం అలవాటు సుందరానికి. ఏమీ జవాబు చెప్పకుండ కన్నీరింకి పోయినట్లు ఊరుకుంటుంది

* * *

పండక్కి వచ్చారు రమ, సుందరం గోవిందుకూడా పండక్కి వచ్చి రమ జీవితం మళ్లీ దారిలో పడ్డందుకు సంతోషం వెలిబుచ్చాడు. సుందరాన్ని మెచ్చుకున్నాడు.

"నే నాక రెండు రోజు లుండి వస్తా నండి! ఒంట్లో బాగోవడం లేదు!" అంది ప్రయాణమవుతున్న సుందరంతో.

"నిక్షేపంగా ఉండు, రెండు రోజు లేం? ఇక్కడే ఉండిపో కావలిస్తే?" నిర్ల క్ష్యంగా అని బయలుదేరాడు. ఆ మాట లకి బయలుదేరిపోదా, మనుకుందిగాని, చితికిపోయిన మనసు వ్యతిరేకించింది. ఆ ఉండిపోవడమే ఘోర తప్పిదమైంది రమకి. వెళ్లిన ఎన్నాళ్లకూ ఉత్తరం లేకపోయేసరికి రామ్మూర్తిని పంపించింది. ఏదయితే ఊహించిందో అదే జరిగింది.

"ఎందు కన్నాయీ, నువ్వు బాధపడ్డం! నాకు తెలుసు ఏమంటారో? ఏం జరిగిందో చెప్పు!"

"మీ చెల్లికి ముందు పెళ్లయిన సంగతి తెలిసినా, జరిగిన సంగతి తెలిసే చేసుకున్నాను! కాని నన్నింత మోసం చేస్తారనుకోలేదు. ఏం? ఆ కరణంగా రబ్బాయికే ఎందు కిచ్చి చేయలేదు? మీ చెల్లికి, అతనికి సంబంధం ఉన్నట్లు ఊళ్లో అంతా చెప్పారు! నన్నెందుకు మోసం చేసినట్లు! మీ చెల్లిని మీ ఇంట్లోనే ఉంచుకోండి!" ఇవి రామ్మూర్తి చెప్పిన మాటలు.

"భగవంతుడికే నా జీవితం ఆటలాట అయిపోయినప్పుడు ఎవర్నని ఏం లాభం?" నిశ్చలంగా లోపలికి వెళ్లిపోతున్న చెల్లిని చూసి ఏం చెప్పాలో తోచక ఇంటికి బయలుదేరాడు, భార్య ఎదురు చూస్తుం దని.

'తన జీవితం ఇలా అవడానికి ఎవరు కారణం? అయినా, లోకంలో ఇంతమంది మంచి మగవాళ్లు ఉండగా తనకే ఎందు కలాంటి వాళ్లు ఎదురై వంచించారు? రెండు సార్లు జీవితంలో ఓడిపోవడానికి కారణం ఏమిటి?' ఇలాంటి ప్రశ్నలతో తలంతా వేడెక్కిపోయింది.

'ఇంకేం మిగిలింది జీవితంలో?' అన్న ప్రశ్న నిశ్చయానికి వచ్చి ఆగిపోయింది.

• • •

"అన్నయ్యా!

అమ్మ తెలిసో, తెలియకో తప్పు చేసింది. దానికి ఫలితం నే ననుభవించాను. మీకు చేసిన అన్యాయానికి నా జీవితం కాలిపోయింది. అయినాసరే, నన్ను నిలబెడ దామని ప్రయత్నించారు. కాని, రెండవ సారికూడా విధి గెలిచింది. ఇంక నాకు చేతకా దన్నయ్యా! అమ్మను క్షమించి ఈ చివరి దినాల్లో చూడండి! అదే నా కోరిక. అసలు అమ్మ ఏమయిపోతుందో! అయినాసరే, నా నిర్ణయం మారదు. నా కింక తట్టుకునే శక్తి లేదు, అన్నయ్యా. ఆయ న్ననవలసిన పని లేదు. విధి చేతిలో కీలుబొమ్మ మాత్రమే ఆయన. ఎంత పాపం చేసినా నా లాంటి శిక్ష మాత్రం ఎవరికీ వద్దని భగవంతుణ్ణే ప్రార్థిస్తు న్నాను.

నీ చెల్లి,
—రమ."

గన్నేరుకాయలు తిని చనిపోయిన రమ దగ్గర కూర్చుని పిచ్చిచూపులు చూస్తున్న తల్లిని చూసి భోరుమని ఏడుస్తూ చెల్లెలి శవం మీద పడిపోయాడు శంకరం. రామ్మూర్తి ఒళ్లో రమ తల ఉంది.

చిన్నప్పుడు రమ బొమ్మను, కొత్తగా పెళ్లి చేసిన చందనపుబొమ్మను తల్లి కొట్టిందన్న కోపంతో భోగిమంటల్లోకి విసిరేసిన సంఘటన గుర్తు వచ్చింది శంకరానికి, అనుకోకుండా! *

## ప్రశాంత నిలయాలు

ఫోటో— శ్రీనివాస జాదవ్ (కొల్హాపూర్)

